క్లుప్తంగా

గురువు కుటుంబానికి ఆర్థిక సాయం



ఉపేంద్ర కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న శిష్యులు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి పంచాయతీకి అనుబంధంగా ఉన్న బొడ్డవలస గ్రామానికి చెందిన కిర్లంపూడి ఉపేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఆయన వృత్తిరీత్యా బొడ్డవలస బ్యాండు పార్టీని నిర్వహిస్తూ గురువుగా వ్యవహరించేవాడు.గురువు మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ బ్యాండు పార్టీలో పని చేసే సభ్యులు, ఆయన శిష్యులు రూ.80వేలు పోగుచేశారు. ఈ మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులు కె.కనకమహాలక్ష్మి, కె.అప్పారావు, కె.రమణ మ్మకు బుధవారం అందించి తమ గురుభక్తిని చాటుకున్నారు. విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన శిష్య బృందం పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధుల దూరం



బొబ్బిలి రూరల్: చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రవికుమార్ తదితరులు

బొబ్బిలి రూరల్/రామభద్రపురం: చేతుల పరిశుభ్రత పాటించడం వల్ల చాలా వరకు వ్యాధుల బారినపడకుండా ఉండవచ్చని ఎంపీడీఓలు పోతుల రవికుమార్, రత్నం అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా బొబ్బిమండలంలోని దిబ్బగుడివలస ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ రవికుమార్, రామభద్రపురం ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రత్నం విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడంపై బుధవారం అవగాహన కల్పించారు. బయట నుంచి ఇంటికి వచ్చేటప్పుడు కాళ్లు, చేతులు కడుక్కోవాలని, భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు.ఉపాధ్యాయులు, పంచాయతీ, మండల సిబ్బంది పాల్గొన్నారు.

• వంగర: గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మండలంలోని రుషింగి, కొప్పర, ఎం.సీతారాంపురం, మద్దివలస, వంగర తదితర గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు వెలుగు సీసీలు, వీఓఏలు చేతుల శుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు.

అన్ని శాఖల సమాచారం సిద్ధం చేయండి

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే సిద్ధం చేయాలని ఎంపీడీఓ పోతుల రవికుమార్ సిబ్బందిని ఆదేశించా రు.మండలంలోని పలు సచివాలయాల్లో బుధవారం ఆయన తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. దిబ్బగుడ్డివలస సచివాలయంలో సిబ్బందితో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, వాటి వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం సందర్శన



బాణ సంచా తయారీకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రామమోహన్‌రావు

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ మధుర గ్రామం ఎరుకుల పాకలో ని అమ్మా భగవాన్ బాణసంచా తయారీ కేంద్రాన్ని బొబ్బిలి ఆర్డీఓ రామమోహన్‌రావు బుధవారం సందర్శించారు. కేంద్రా నికి లైసెన్స్ ఉన్నదీ,లేనిది, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారా లేదా అని పరిశీ లించారు. బాణసంచా తయారీ కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్, అగ్నిమాపక శాఖ అధికారి నాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావు ఉన్నారు.

భూరీసర్వే పరిశీలన

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో చేపడుతున్న భూరీసర్వేను తహసీల్దార్ ఐ.కృష్ణలత బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలో రీసర్వేను పక్కాగా చేపట్టాలని, వివరాలను తప్పులు లేకుండా రికార్డుల్లో పొందుపరచాలని చెప్పారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా రీసర్వే అనంతరం నోటీసులు అందజేస్తామని, ఆ నోటీసుల ప్రాప్తికి గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆమె వెంట వీఆర్ఓ రామకృష్ణ ఉన్నారు.

నేతన్నకు కూటమి వంచన

- చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- అమలు కాని 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం
- అందని రూ.25 వేల ఆర్థిక సహాయం



రామచంద్రాపురంలోమగ్గం నేస్తున్న నేతన్న

బాడంగి: అధికారం కోసం ఎన్నికల సమయంలో ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారం చేజిక్కాక వాటిని విస్మరించడం సీఎం చంద్రబాబునాయుడుకు అల వాటుగా మారిందనే విమర్శలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఓట్లు వేసే ప్రజలతో పాటు వారికి ఇచ్చే హామీలను మరచి పోవడమనే తన అలవాటు మార దని ఆయన కూడా నిరూపించుకుంటూ వస్తున్నారు. అన్ని వర్గాల మాదిరిగానే చంద్రబాబు మాయమాటలకు చేనేత కార్మికులు కూడా మోసపోయారు. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ యూనిట్లకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి తరపున చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. బాడంగి మండలంలో చేనేత కుటుంబాలు వందకుపైగా ఉన్నాయి. వీరంతా సాధారణ చేతి మగ్గాలపై నేత నేస్తున్నారు. కూటమి హామీ ఇచ్చిన మేరకు వీరంతా 200 యూని ట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులు. కానీ ఒక్క కుటుంబానికి కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో మాదిరిగా 100 యూనిట్ల వరకు మాత్రమే ఉచిత విద్యుత్ వర్తిస్తోందని, ఆపై వినియోగించే విద్యుత్‌కు బిల్లులు వస్తున్నాయని పలువురు నేతన్నలు చెబుతున్నారు.

జీఓతో సరిపెట్టారు..

చేనేత కుటుంబాలకు, పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అమలు చేసేలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో జీఓ–44 విడుదల చేసింది. చేనేత కుటుం బాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీఓలో స్పష్టం చేశారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం రోజున ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే నేటికీ అమలుకు నోచుకోలేదు.జీఓ ఇచ్చి ఆరునెలలు, చంద్రబాబు మళ్లీ మాట ఇచ్చి రెండు నెలలు గడిచిపోయినా పథకం అమలుపై అతీగతి లేకపోవడంపై నేతన్నలు మండిపడుతున్నారు.

నేతన్నకు దక్కని భరోసా

రాష్ట్రంలోని చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు నేతన్నలకు ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని నేతన్న భరోసా పథకం కింద అందిస్తామని గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ ఏడాది ఆగస్టు 7 నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ పథకం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నేతన్నలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయడంతో పాటు నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతీ నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సహాయం అందజేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సహాయం నిలిచిపోయింది. దీంతో నేతన్నలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సొసైటీలు పనిచేయక మధ్యవర్తులిచ్చిన మజూరీతో జీవనం సాగిస్తున్నమని నేతన్నలు వాపోతున్నారు. ఉచిత విద్యుత్‌తో పాటు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని నేతన్నలు కోరుతున్నారు.

ప్రోత్సాహం లేదు



చేనేత కార్మికులు చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం.సరిగ్గా పనులు దొరకడం లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ప్రోత్సాహం లేదు.వయస్సు పైబడుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదు. ఉచిత కరెంటు, ఆర్థిక సహాయం అందించాలి.

– వానపల్లి సత్యనారాయణ, చేనేత కార్మికుడు, రామచంద్రాపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



సొసైటీల ద్వారా ముడి సరుకులు ఇవ్వకపోవడంతో మధ్య దళారులు ద్వారా వచ్చిన ఆర్డర్లను మంజూరుకు నేసుకుంటూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో బతుకుతున్నాం. 50 ఏళ్లకు పింఛన్ ఇస్తామన్నారు. ఇక్కడ 50 ఏళ్ల వారెవరికీ పింఛన్ రావడం లేదు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించలేదు. ఏడాదికి ఇస్తామన్న రూ.25 వేల ఆర్థిక సహాయమూ అందలేదు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తమను ప్రభుత్వం ఆదుకోవాలి

– వానపల్లి రాజు, చేనేత కార్మికుడు, రామచంద్రాపురం

పరామర్శ



ముత్యాలరావును పరామర్శిస్తున్న రాజేష్, తదితరులు

వంగర: సంగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉగిరి ముత్యాలరావు సోదరి శీరపు సత్యవతి ఇటీవల మృతి చెందా రు.రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తలే రాజేష్ బుధవారం సంగాం గ్రామం వెళ్లి ముత్యాలరావు కుటుంబ సభ్యులను పరామర్శించా రు. సత్యవతి మృతికి కారణాలను అడిగితెలుసుకుని, సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, పార్టీ నాయకులు గేదెల రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు తదితరులు

బొబ్బిలి: ఉత్తరాంధ్రలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం దారు ణమని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు.ఉత్తరాంధ్ర సాధన సమితి స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం కోసమంటూ లెక్కకు మిక్కిలిగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం అందులో 10 శాతం సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేస్తే ఈ ప్రాంతమంతా మరింత సస్యశ్యామలమయ్యేదన్నారు. ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేపడితే పీపీపీ అనే పాటపాడుతున్నారే తప్ప ప్రభుత్వం చేస్తున్న ఎలాంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం ఏమిటని విమర్శించారు. సమితి సభ్యులు వజ్జి రవి కుమార్, తమ్మిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

- డీఎస్పీ భవ్యారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: రేపటి పౌరులుగా సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత నేటి విద్యార్థి దశతో ముడిపడి ఉందని, క్రమశిక్షణతో చదువుకునే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో 'క్రమ శిక్షణ ఆవశ్యకత' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ వివిధ రంగాల్లోపై చేయి సాధించి , మంచి ఉన్నతోద్యోగాల్లో స్థిరపడాలంటే ప్రస్తుతం విద్యార్థులంతా చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. అల్లరి,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మోసం చేయడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, డబ్బులు చెల్లించే ఆన్‌లైన్ గేమ్‌లను ఆడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆదాయాన్ని దుబారాచేసి వారిని వీధిలోకి లాగొద్దన్నారు. ఇతర నేరస్థుల వలే జువైనల్ కేసులు, జైళ్ల బారిన పడడం, కేసులు చుట్టుముట్టడం మీకు ఈ వయస్సులో అవసరమా అని సున్నితంగా చెబుతూ వారిని అప్రమత్తం చేశారు. చెడు అలవాట్లు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి కేసుల్లో తక్కువ వయస్సు ఉన్న బాలలు జైళ్లల్లో మగ్గిపోతున్నారో ఉదాహరణలతో వివరించారు. ప్రిన్సిపాల్ డి.రఘునాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

భారతరత్న, మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె.అబ్దుల్ కలాం ఆదర్శ ప్రాయుడు, భావితరాలకు మార్గదర్శి అని పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రంథాలయాల్లో అబ్దుల్ కలాం జయంతిని బుధ వారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వంగర: వంగరలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ వెంకటరావు, ఉపాధ్యాయులు



తెర్లాం: తెర్లాం గ్రంథాలయంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి: ఎంపీడీఓ కార్యాలయంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రామారావు,ఎంపీడీఓ



రాజాం సిటీ: కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్,రోటరీ క్లబ్ సభ్యులు, విద్యార్థులు


బాణసంచా దుకాణాల్లో స్కిల్డ్ వర్కర్లు ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: దీపావళి సందర్భంగా బొబ్బిలి డివిజన్‌లో తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు పొందిన వారు తమ దుకాణాల్లో కూలీ లను కాకుండా స్కిల్డ్ వర్కర్లను నియమించుకోవాలని డీఎస్పీ జి.భవ్యారెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాణసంచా దుకాణదారులు, పోలీస్ సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాత్కాలిక దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, గాలి,వెలుతురు తగిలేలా ఉండాలని అన్నారు. ఇసుక, నీరు దుకాణాల వద్ద సిద్ధం చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కిల్డ్ వర్కర్లకు బీమా కల్పించాలని, దీపావళి ముగిసిన వెంటనే మిగిలిన బాణసంచా సామగ్రిని తిరిగి ఎక్కడ కొనుగోలు చేసి తెచ్చారో వారికే అప్పగించాలని చెప్పారు.సీఐ కె.సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వరుణ్ గైక్

బాడంగి: మండలంలోని వాడాడ పీహెచ్‌సీలో కేంద్ర వైద్య,ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ వరుణ్ గైక్ బుధవారం తనిఖీలు నిర్వ హించారు.మలేరియా, క్షయ, లెప్రసీ వంటి వ్యాధులకు చికిత్స తీసుకుం టున్న వారి వివరాలను, మందుల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా లెప్రసీ,ఎయిడ్స్, క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాణి,తదితరులు ఉన్నారు.

12 గంటలు పని చేయించుకోవడం అన్యాయం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లోపారిశుద్ధ్య కార్మికులతో రోజుకు 12 గంటల పాటు పనిచేయించుకోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బుధ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్లు, ఆర్టీసీ అధికారులు కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ 12 గంటల పాటు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. కనీస వేతనాల చెల్లింపునకు కార్మికుల తరపున టెండర్లు వేయాల్సి ఉందని, ఈటెండర్లు కనీస వేతనాల కంటే తక్కువకు కోట్ చేస్తే ఆర్టీసీ అధికారులు వాటిని తిరస్కరించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ పని చేయడం లేదని ఆరోపించారు. దీనికి తోడు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. వాస్తవానికి టెండర్లు దాఖలు చేసినప్పుడు కార్మికుల సరఫరాకు ఒక్కొక్కరికీ ఎంత చొప్పున కోట్ చేశారో కార్మికులకు కూడా తెలియకపోవడం విచారకరమన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం టెండరు వేయకుండా నెలకు రూ.8,500 ఇస్తూ రోజుకు 12గంటల పాటు పనిచేయించు కోవడం దారుణమని, వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

డోలపేట హైస్కూల్‌లో డీఈఓ దర్యాప్తు



దర్యాప్తు చేస్తున్న డీఈఓ మాణిక్యాలరావు

రాజాం: పట్టణంలోని డోలపేట ఉన్నత పాఠశాలలో గతంలో విడుదలైన నాడు–నేడు పనులకు సంబంధించిన నిధులపై డీఈఓ మాణిక్యాలరావు బుధవారం దర్యాప్తు నిర్వహించారు. స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిధుల విడుదల, కాంట్రాక్టర్లకు చెల్లింపు, పనుల నిర్వహణను పరిశీలించారు. గతం లో ఇక్కడ విడుదలైన నిధులను కాంట్రాక్టర్లకు, వెండర్లకు అప్పటి ఇక్కడి హెచ్ఎం వసంతకుమార్ చెల్లించలేదనే ఆరోపణలపై వివరాలు సేకరించారు. పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని వెండర్లకు సూచించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, ల్యాబ్‌ల నిర్మాణంపై ఆరాతీశారు. ఆయన వెంట ఎంఈఓ యాగాటి దుర్గారావు, పాఠశాల హెచ్ఎం, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తనిఖీకి యాప్



ఎక్సైజ్ సీఐ జైభీమ్

రాజాం: మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యత తనిఖీ నిమిత్తం ప్రభుత్వం మొబైల్ యాప్ తీసుకొచ్చిందని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా కొనుగోలు దారులు తమ సమీపంలోని దుకాణాల వద్ద లభించే మద్యం ప్రభుత్వం సరఫరా చేసిందో కాదో తెలుసుకోవచ్చనని అన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వెల్లడించారు. ఈయాప్ ద్వారా మద్యం బాటిళ్ల కప్పు పై హీల్‌కు అతికించి ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆ మద్యం ఎక్కడ తయారైంది, ఏ షాపులో విక్రయిస్తున్నారన్న విషయం తెలుస్తుందని పేర్కొన్నారు. బీరు సీసాకు ఈ సిస్టమ్ లేదని, కేవలం లిక్కర్ బాటిళ్లపై మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కడైనా వివరాలు లేని బాటిళ్ల విక్రయాలు జరిపితే 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ ఆశయ్య, డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోయి ఆరోగ్యంతో పాటు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య, డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది యువకులు, విద్యార్థులు ప్రస్తుత రోజుల్లో ఫ్యాషన్ అంటూ మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ ఎం.రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐ మహేష్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నాణ్యమైన వైద్యం అందడం లేదు

బొబ్బిలి రూరల్: గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, సకాలంలో వైద్య సేవలు అందక అమాయక గిరిజనులు చనిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జ్వరంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన మండలంలోని గిరిజన గ్రామం కృపావలసకు చెందిన విద్యార్థిని పల్లవి కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సురక్షిత తాగునీరు లేకపోవడంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నారన్నారు. కేవలం జ్వరంతోనే బాలిక మృతి చెందిందంటే గిరిజనులకు ఏస్థాయి లో వైద్యసేవలందుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి గోపాలం,ఉన్నారు.

పాఠశాలలో తనిఖీ

రేగిడి: చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి, వారి అభ్యసనా సామర్థ్యాన్నా మెరుగుపరచాలని ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు.మండలంలోని తోకలవలస ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు.విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు హెచ్ఎం కృష్ణారావుకు పలు సూచనలు చేశారు.

మోటారు చోరీపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగరాయపురం గ్రామానికి చెందిన రైతు పొగిరి సత్యంనాయుడు తన వ్యవసాయ మోటార్ చోరీ అయిందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలు.. పొగిరి సత్యంనాయుడు మద్దువలస కాలువ వద్ద వ్యవసాయానికి నీరు అందించేందుకు మోటార్ ఏర్పాటు చేసుకున్నారు. పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొందరు ఆగస్టు 21న మోటార్‌ను అపహరించారని రైతు సత్యంనాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని చెప్పారు.

పంచాయతీ పునర్విభజనపై గ్రామసభ

బొబ్బిలి రూరల్: మండలంలోని కాశిందొరవలస పంచాయతీ పునర్విభజన కోసం గ్రామస్తులు దరఖాస్తు చేసుకోవడంతో బుధవారం ఆ గ్రామంలోని రామ మందిరం వద్ద పంచాయతీ కార్యదర్శి సుగణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.అనుబంధ గ్రామాలైన చిలకమ్మవలస, మోసూరువలస, డొంగు రువలస, ఎరకందొరవలస గ్రామాలను ఒక పంచాయతీగా చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే కాశిందొరవలస గ్రామాన్ని మరొక పంచాయతీగా ఉంచాలని గ్రామస్తులు, నాయకులు కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

రేగిడి: మండలంలోని అక్కన్నఅగ్రహారం గ్రామంలో రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స, సాధారణ వైద్యపరీక్షలు చేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు పశువైద్యాధికారి వివరించారు. పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి

బొబ్బిలి : గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టిసారించాలని ఐసీడీఎస్ పీడీ విమలరాణి సూచించారు. పట్టణం లోని బాలసదన్, మండలంలోని గొర్లె సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. మెనూ ప్రకారం చిన్నారుల కు భోజనం వండి పెడుతున్నారా లేదా అని పరిశీలించారు.పోషణ్ మహా కార్యక్రమం వివరాలను స్థానిక బాలింతలు, గర్భిణులకు వివరిం చారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి, డీపీఓ సత్యనారాయణ, డీసీపీఓ లక్ష్మి, నాగరాజు, సూపర్‌వైజర్ శుభలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

రాజాం: గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని ఐసీడీ ఎస్ రాజాం ఇన్‌చార్జ్ పీఓ నూకాలమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాజాం ఐసీడీఎస్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు బుధవారం అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



